డీజీపీని కలిసిన ఎస్పీ

విజయనగరం క్రైం, ఆగస్టు 28: డీజీపీ ద్వారకా తిరుమలరావును ఎస్పీ వకుల్‌జిందాల్ విశాఖపట్నంలోని పోలీసు మెస్ వద్ద మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలోని శాంతిభద్రతలపై కొద్దిసేపు చర్చించారు.



దొరికిపోతున్నారు



- జిల్లా వ్యాప్తంగా తనిఖీలు.. గంజాయిపై నిఘా!
- వైసీపీ హయాంలో యథేచ్ఛగా రవాణా
- అలవాటు పడి పెడదారి పట్టిన యువత
- వారించిన పెద్దలపై తిరుగుబాట్లు

శృంగవరపుకోట/ రాజాం, ఆగస్టు 28

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు పర్యాటక ప్రాంతం నుంచి ఓ లారీ వస్తోంది. గంజాయిని తరలించే వాహనంగా అనుమానించిన పోలీస్‌లు శృంగవరపుకోట మండలం బొడ్డవర చెక్‌పోస్టు వద్ద అడ్డగించారు. డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా తప్పించుకుని వెళ్లిపోయాడు. అప్రమత్తమైన పోలీస్‌లు లక్కవరపుకోట పోలీస్‌లకు సమాచారం అందించారు. అక్కడా తప్పించుకున్నారు. అన్ని చోట్ల నుంచి పోలీస్‌లు వెంబడిస్తున్నారని గ్రహించి కొత్తవలస మండలం అప్పన్నపాలెం వద్ద వాహనాన్ని వదిలేశారు. డ్రైవర్‌తో సహా పరారయ్యారు. ఈ వాహనంలో సుమారు 450 కేజీల గంజాయి ఉన్నట్లు పోలీస్‌లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఇటీవల కాలంలో ఇంత పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడడం ఇదే తొలిసారి. ఈ ఘటన మూడు రోజుల కిందట జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీసులు గంజాయి రవాణా నివారణపై పట్టు బిగించారు. జిల్లా దాటే ప్రసక్తి లేదని, ఖచ్చితంగా పట్టుకుంటామని చెప్పడమే కాదు గట్టి నిఘా పెట్టారు. గంజాయి ఏ మాత్రం రవాణా చేస్తున్నా గుర్తిస్తున్నారు. గత శనివారం ఉదయం 11 గంటల సమయంలో కూడా అరకు నుంచి ద్విచక్రవాహనాలతో వస్తున్న ఇద్దరు యువకులు బొడ్డవర చెక్ పోస్టువద్ద గంజాయితో పట్టుబడినట్లు సమాచారం. అక్కడికి మూడు రోజుల కిందట ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గంజాయి బ్యాగులతో పలువురు పోలీస్‌లకు చిక్కారు.


కొత్తవలస మండలం అప్పన్నపాలెం వద్ద గంజాయితో గుర్తించిన వాహనం

కట్టడి దిశగా అడుగులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతోంది. ఎట్టిపరిస్థితుల్లోనూ రవాణా, వినియోగాన్ని కట్టడి చేయాలని పోలీస్ శాఖకు ఆదేశాలను జారీ చేసింది. దీంతో పోలీస్ శాఖ కూడా వీటి నియంత్రణపైనే దృష్టిపెట్టింది. విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. ఎస్పీ వకుల్‌జిందాల్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పాత నేరస్తులు, అనుమానితులపై సస్పెక్టెడ్ షీట్‌లు తెరిచేందుకు సిద్ధపడుతున్నారు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్టు కేసుల నమోదుకు వెనుకాడబోమని ఎస్పీ హెచ్చరిస్తున్నారు. అయినా గంజాయి రవాణా ఆగడం లేదు. అంతగా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గంజాయి రవాణా, వాడకానికి అలవాటుపడ్డారు.

అరకు నుంచి ఎస్.కోట మీదుగా..

ఎక్కడ గంజాయి పట్టుబడిన అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు, పాడేరు, రంపచోడవరం ప్రాంతాల పేర్లు వినిపిస్తున్నాయి. ఇందులో అత్యధికంగా అరకు పర్యాటక ప్రాంతం పేరు తప్పక ఉంటుంది. అరకు ప్రాంతానికి శృంగవరపుకోట పట్టణం ముఖద్వారంగా ఉంది. ఒడిశా సరిహద్దు ప్రాంతంలో వున్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి పంటను అత్యధికంగా పండిస్తున్నారు. ఢిల్లీ, ముంబయి, ఒడిశా, హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు వంటి నగరాలకు చెందిన స్మగ్లర్లు గంజాయి పంట పండించేందుకు పెట్టుబడులు పెడుతున్నారు. ఇలా పండిన పంటను తరలించేందుకు ఏజెంట్లను నియమించుకుంటున్నారు. అరకు, అనంతగిరి పోలీస్‌స్టేషన్‌లను దాటుకొని ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస, విశాఖ జిల్లా పెందుర్తి, గోపాల పట్నం పోలీస్‌స్టేషన్‌ల కళ్లుగప్పి గంజాయిను పట్టుకుపోతున్నారు. మరో వైపు మెంటాడ, సాలూరు, గజపతినగరం, విజయనగరం మీదుగానూ తరలిస్తున్నారు. స్మగ్లర్లు నియమించుకున్న ఏజెంట్ల మధ్య వచ్చిన విభేదాలతో అప్పుడప్పుడు గంజాయిను పోలీస్‌లు పట్టుకుంటున్నారు. రవాణాదారులు దొరుకుతున్నారు తప్ప అసలైన నేరస్తులు(సూత్రదారులు) బయటే తిరుగుతున్నారు.



యువత పెడదారి..

గంజాయి రవాణాను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో స్థానికంగా వున్న యువత కూడా దీని వినియోగానికి అలవాటు పడింది. గంజాయి రవాణా చేస్తే వేలు, లక్షల్లో డబ్బులు కమీషన్‌గా ముట్టజెబుతున్నారు. పెద్దగా కష్టపడకుండా డబ్బులు చేతిలో పడడంతో మద్యం, పేకాట వంటి ఇతర దురలవాట్లకు అలవాటు పడ్డారు. మద్యం సేవించడంతో వచ్చిన కిక్కుకంటే గంజాయితో ఎక్కువ కిక్కు వస్తుందని వాడడం మొదలెట్టారు. శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో యువత రాత్రయితే చాలు గంజాయి పీల్చుతూ ఊగిపోతున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రభుత్వ పాఠశాలలను కూడా వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒద్దని వారించే గ్రామ పెద్దలపైనా తిరగబడుతున్నారు.

10.5 కిలోల గంజాయి స్వాధీనం

విజయనగరం క్రైం, ఆగస్టు 28: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలో జీఆర్‌పీ ఎస్‌ఐ బాలాజీరావు సిబ్బందితో బుధవారం తనిఖీలు చేస్తుండగా తమిళనాడు రాష్ట్రం దిండిఖల్లు జిల్లాకు చెందిన సురందర్‌కుమార్, ఆంటోనీ న్యూగాడ్సన్‌లు గంజాయితో పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 10.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు పంపారు. ఘటనపై సీఐ వెంకటరావు మాట్లాడుతూ జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ ఫోర్సులతో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి విజయనగరం, బొబ్బిలి, కొత్తవలస, పార్వతీపురం రైల్వే స్టేషన్‌ల పరిధిలో తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు.


గంజాయి, నిందితులతో జీఆర్‌పీ ఎస్‌ఐ బాలాజీరావు, సిబ్బంది

ముందే పింఛన్లు: కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం(ఆంధ్రజ్యోతి):
వచ్చే నెల ఒకటి ఆదివారం పడడంతో పింఛనుదారులకు ఆ రోజు పెన్షన్ ఇవ్వడం కుదరదు కాబట్టి వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ నెలాఖరునే అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిపై రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి నుంచి అధికారిక సమాచారం వచ్చినట్లు తెలిపారు. ఆ ప్రకారం ఆగస్టు 31న పింఛను పంపిణీ చేపడ్తామని, మిగిలిన వారికి సెప్టెంబరు 2న అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఎప్పటిలాగే పింఛనుదారుల ఇంటికి సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛను మొత్తాలను అందజేస్తారని తెలిపారు.




ఒకే రోజు లక్ష మొక్కలు

- 30న నాటాలని లక్ష్యం
- వన మహోత్సవం పురస్కరించుకుని ఏర్పాట్లు: కలెక్టర్


వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, ఆగస్టు 28: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 30న వన మహోత్సవం పురస్కరించుకుని జిల్లాలో ఒకే రోజు లక్ష మొక్కలు నాటాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లక్ష మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించామని, తర్వాత దశల్లో అటవీశాఖ వద్ద ఉన్న మరో 7 లక్షల మొక్కలు నాటేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖలు భాగస్వాములై విజయవంతం చేయా లని కోరారు. డెంకాడ మండలం బేతానపల్లి అటవీశాఖ కార్యాలయం వద్ద వనమహోత్సవ ప్రారంభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అన్ని పాఠశాలలు, కళాశాలల ఆవరణలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించాలని విద్యా శాఖ, ఇంటర్ బోర్డు అధికారులను ఆదేశించారు. గిరిజన విశ్వవిద్యాలయం, జెఎన్‌టీయు పరిధిలోనూ విరివిగా మొక్కలు నాటాలన్నారు. సంక్షేమ వసతిగృహాలు, హౌసింగు కాలనీలు, దేవాలయ ఆవరణలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పరిశ్రమలు, ఆసుపత్రుల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. రోడ్లు, కాలువల పక్కన కూడా మొక్కలు నాటాలని జడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజుకి సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమంపై సెప్టెంబరు 1 నుంచి 15 వరకూ జిల్లాలోని విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన, డ్రాయింగ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖాధికారి వెంకటేష్, డీఈవో ప్రేమ్‌కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, డ్వామా ఇన్‌చార్జి పీడీ అరుణ శ్రీ, డీఎస్‌డబ్ల్యూఓ రామానందం, ఎల్‌డీఎం రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ నల్లనయ్య బాధ్యతల స్వీకరణ



విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 28: విజయనగరం నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా పల్లి నల్లనయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలోని ఆయన చాంబర్లో తొలి సంతకం పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అందరి సహకారంతో నగరాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్పొరేషన్ ఆస్తులు కాపాడుతూ ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రెవెన్యూ పెంపు, ప్లాస్టిక్ నిర్మూలనతో పాటు స్వచ్ఛనగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు.



పీఏసీఎస్‌ల్లో ఆర్థిక కష్టాలు

- 65 బ్రాంచుల్లో లాభాల్లో ఉన్నవి 11 మాత్రమే
- సభ్యత్వాలకు ఆసక్తి చూపని రైతులు
- వైసీపీ పాలనలో సహకార వ్యవస్థ నిర్వీర్యం
- రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చేసిన వైనం

'జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు)ను బలోపేతం చేయాలి. సంఘం పరిధిలో ఉన్న ప్రతి రైతునూ అందులో సభ్యులుగా చేర్చుకోవాలి. ప్రతి పీఏసీఎస్‌ను లాభాల బాటలోకి తీసుకురావాలి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలోనే అత్యధిక పీఏసీఎస్‌లు ఉన్నా, అవకాశాన్ని అందిపుచ్చుకోలేని స్థితిలో ఉండడం దురదృష్టకరం'

- ఈ నెల 20న జరిగిన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం(ఆంధ్రజ్యోతి):
జిల్లాలో ప్రాథమిక వ్యవసాయపరపతి సంఘాలు నష్టాలబాటలో పయనిస్తున్నాయి. గత ప్రభుత్వ నిర్ణయాలతో ఆర్థిక ఇబ్బందులు ప్రారంభం కాగా ఏడాదికేడాది నష్టాల్లో కూరుకుపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 63 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, రెండు రైతు సేవా సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా 54 పీఏసీఎస్‌లు నష్టాల బాటన నడుస్తున్నాయి. కేవలం 11 సంఘాలు మాత్రమే లాభాల్లో ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా రాజాం పీఏసీఎస్ రూ.5 కోట్ల నష్టంలో ఉంది. ఆ తరువాత స్థానాల్లో గాజులరేగ రూ.3.10 కోట్లు, పూసపాటిరేగ రూ.2.95 కోట్లు, సోమలింగాపురం రూ.2.28 కోట్లు, లక్కిడాం రూ.2.20 కోట్లు, జొన్నాడ రూ.1.95 కోట్లు, చింతాడ రూ.1.83 కోట్లు, భోగాపురం రూ.1.61 కోట్లు, తాడిగూడ పీఏసీఎస్ రూ.1.60 కోట్ల నష్టాలతో అగ్రభాగాన ఉన్నాయి. లాభాల బాటలో ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితి.

రూ.25 కోట్ల కమీషన్ పెండింగ్

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను మరింత బలోపేతం చేయాల్సిన వైసీపీ ప్రభుత్వం వీటిని నిర్వీర్యం చేసింది. ఎన్నికలు నిర్వహించకుండా రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చింది. ప్రధానంగా పీఏసీఎస్‌లకు ఎరువుల విక్రయాలు, ధాన్యం కొనుగోళ్లలో కమీషన్ రూపంలో ఆదాయం వస్తుంది. అయితే గత ఐదేళ్లలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రూ.25 కోట్ల కమీషన్ పెండింగ్‌లో ఉంచేసింది. కేంద్ర ప్రభుత్వం గిడ్డంగుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఒక్కో గిడ్డంగి నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వంపరంగా మ్యాచింగ్ గ్రాంట్ జతచేయకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

వైసీపీ నేతల పునరావాస కేంద్రాలుగా

గత ఏడేళ్లుగా పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరగలేదు. చివరిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో 2013లో ఎన్నికలు జరిగాయి. 2018తో వీరి పదవీకాలం ముగిసింది. అప్పటికే సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో నాడు చంద్రబాబు సర్కారు పాత కార్యవర్గాలనే కొనసాగించింది. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీతో తన పార్టీ ప్రతినిధులను నామినేట్ చేసింది. ఈ విధంగా ఆ పార్టీ నాయకులకు పునరావాస కేంద్రాలుగా మార్చేసింది. నామినేట్ అయిన సభ్యులకు పీఏసీఎస్‌లకు కనీస అవగాహన లేకపోవడంతో నష్టాల బాట పట్టాయి. తాజాగా ప్రభుత్వం మారడంతో పీఏసీఎస్ అధ్యక్షులతో పాటు త్రిసభ్య కమిటీలు రాజీనామా చేశాయి. ప్రస్తుత ప్రభుత్వం పీఏసీఎస్‌ల బలోపేతానికి చర్యలు తీసుకుంటుండడంతో కలెక్టర్ అంబేడ్కర్ అధికారులతో సమావేశం నిర్వహించి పీఏసీఎస్‌లపై దృష్టిసారించాలని ఆదేశాలు జారీ చేశారు.

సభ్యత్వానికి రైతుల విముఖత

పీఏసీఎస్‌లు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారడంతో అసలైన రైతులు వీటిలో సభ్యత్వం తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రారంభంలో ఎటువంటి రుసుం చెల్లించకుండానే రైతులు ఈ సంఘాల ద్వారా పంట రుణాలు, ఎరువులు పొందేవారు. పంట ఉత్పత్తులు విక్రయించిన తరువాత చెల్లించేవారు. ఆ తరువాత రోజుల్లో సభ్యత్వ రుసుం కింద రూ.10 వసూలు చేసేవారు. సంఘ సభ్యులుగా చేర్చుకునేవారు. ప్రాంతీయ వ్యవసాయ కోఆపరేటివ్ బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందేవారు. అయితే ప్రస్తుతం పీఏసీఎస్‌ల్లో రైతుల సభ్యత్వం తగ్గిపోయింది. సభ్యత్వ రుసుం ఏకంగా రూ.300కు పెరిగింది. అయితే ప్రభుత్వపరంగా సహకార సంఘాలకు ఎటువంటి నిధుల కేటాయింపు లేకపోవడంతో రైతులు అటువైపుగా చూడడం మానేస్తున్నారు.

మసకబారిన చరిత్ర..


19వ శతాబ్దం చివరి రోజుల్లో సహకార ఉద్యమం నడిచిన రోజుల్లో గ్రామాల్లోని రైతులను వడ్డీ వ్యాపారులు పిప్పిచేసేవారు. దీంతో రైతులు ఉద్యమ బాట పట్టారు. ఆ క్రమంలో ప్రభుత్వం సహకార వ్యవస్థను ప్రవేశపెట్టక తప్పలేదు. నాబార్డు.. రాష్ట్ర సహకార బ్యాంకులకు రుణాలు ఇస్తే.. అక్కడ నుంచి జిల్లా సహకార బ్యాంకులకు, ఆటు తరువాత ప్రాంతీయ కోపరేటివ్ బ్యాంకులకు రుణాలు సర్దుబాటు చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సహకార వ్యవస్థకు నిధుల సర్దుబాటు నిలిచిపోయింది. నిధులన్నీ నవరత్నాలకే మళ్లించడంతో పీఏసీఎస్‌లకు నిధుల సమస్య ఏర్పడింది.. దీంతో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల సరఫరా సైతం తగ్గుముఖం పట్టింది.

పీఏసీఎస్‌ల బలోపేతానికి చర్యలు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల బలోపేతానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతానికి రుణ రికవరీ బాగానే జరుగుతోంది. పారదర్శక సేవల కోసం కంప్యూటరీకరణ చేస్తున్నాం. అక్టోబరు 2 నుంచి ఇక సంఘాలన్నీ ఆన్‌లైన్‌లో లావాదేవీలు జరపాల్సిందే. సంఘాలను ఆర్థికంగా లాభాల్లోకి తెచ్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం.

-పి.రమేష్, జిల్లా సహకార శాఖ అధికారి, విజయనగరం

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ



(కలెక్టరేట్)
ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను కంప్యూటరీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకనుగుణంగా జిల్లా వ్యాప్తంగా అన్ని సొసైటీల్లో ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా 65 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. వీటిల్లో ఇప్పుడు రైతులు.. వారి భూముల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. రైతుల ఆధార్ వివరాలతో పాటు ఎంత రుణం తీసుకున్నారు? ఎంత చెల్లించారు? ఇంకా ఎంత పెండింగ్ ఉంది? అనే వివరాలను నమోదు చేస్తున్నారు. కాగా అక్టోబరు రెండో తేదీ నుంచి ప్రాథమిక వ్యవసాయ పరిపతి సంఘాలు పూర్తిగా ఆన్‌లైన్ వ్యవస్థలోకి రానున్నాయి. ఇదే విషయమై జిల్లా సహకార అధికారి రమేష్ వద్ద ప్రస్తావించగా ప్రస్తుతం అన్ని సొసైటీల్లో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ జరుగుతోందని, అక్టోబరు 2 నుంచి పీఏసీఎస్‌ల్లో ఆన్‌లైన్ వ్యవస్థ అమల్లోకి రానుందని ధ్రువీకరించారు.

దిక్సూచి

అడ్మిషన్స్



ఎన్‌జీ రంగా వర్సిటీలో ఎన్‌ఆర్‌ఐ సెకండ్ ఫేజ్

గుంటూరులోని ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- ఎన్‌ఆర్‌ఐ కోటా కింద డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సెకండ్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. అకడమిక్ ప్రతిభ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ అవసరం లేదు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల వివరాలు

బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, ... ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్ కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం

వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్‌ఆర్‌ఐ వీసా-పాస్‌పోర్ట్- ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. అభ్యర్థులు తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

ఏసీఎస్‌ఐఆర్‌లో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్(ఏసీఎస్‌ఐఆర్)- ఇంటిగ్రేటెడ్ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్(ఐడీడీపీ-ఎంటెక్&పీహెచ్‌డీ); పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు.

పరిశోధన విభాగాలు

సైన్స్ విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, అగ్రికల్చరల్ సైన్సెస్, మేథమెటికల్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్

- మెడికల్ రీసెర్చ్ ● ఇంజనీరింగ్

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** www.acsir.res.in/admissions

రిమైండర్

నిమ్స్‌లో ఎంహెచ్‌ఎం

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- 'మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ఆర్నెల్ల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇది ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 'నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం 2024'లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు సమయంలో ఇతర డిగ్రీ/డిప్లొమా ప్రవేశాలకు, ప్రైవేట్ ప్రాక్టీస్/కన్సల్టేషన్‌లకు అనుమతించరు. ప్రోగ్రామ్‌ను గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 3 నుంచి
- **నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం 2024 తేదీ:** అక్టోబరు 9న
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 10
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 17
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** అక్టోబరు 26
- **తరగతులు ప్రారంభం:** నవంబరు 4 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పంజాగుట్ట, హైదరాబాద్-500082
- **వెబ్‌సైట్:** nims.edu.in

కురుక్షేత్ర వర్సిటీలో పీజీ డిప్లొమా

కురుక్షేత్ర యూనివర్సిటీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ- 'పీజీ డిప్లొమా ఇన్ ఆర్కైవ్స్ అండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఈవెనింగ్ ప్రోగ్రామ్. దీనిని సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద నిర్వహిస్తున్నారు. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఇన్ హిస్టరీ ఉత్తీర్ణులై ఉండాలి. మోడరన్ ఇండియన్ హిస్టరీ ఒక సబ్జెక్ట్‌గా చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, బీసీ అభ్యర్థులకు రూ.250.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- ఎంపికైన అభ్యర్థుల మొదటి జాబితా విడుదల: సెప్టెంబరు 2న
- ఎంపికైన అభ్యర్థుల రెండో జాబితా విడుదల: సెప్టెంబరు 5
- తరగతులు ప్రారంభం: సెప్టెంబరు 9 నుంచి
- వెబ్‌సైట్: www.kuk.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AxmEvBlలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

హీరోగా మారిన విలన్ కథ ఇది




నేను 'మగధీర' చిత్రానికి కో డైరెక్టర్‌గా పని చేశా. ఆ సమయంలోనే దేవ్ గిల్‌తో పరిచయం ఏర్పడింది. దేవ్ ఈ సినిమా ప్రపోజల్‌తో వచ్చాడు. అలా ఈ ప్రాజెక్ట్ మొదలైంది' అన్నారు దర్శకుడు త్రికోటి. దేవ్ గిల్ హీరోగా నటించిన 'అహో విక్రమార్క' చిత్రానికి ఆయన దర్శకత్వం వహించారు. ఈ నెల 30న ఆ సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'ఇందులో దేవ్ గిల్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషించాడు. ఓ విలన్ హీరోగా మారితే ఎలా ఉంటుందనేది ఈ చిత్రకథ అనీ, మదర్ సెంటిమెంట్ కూడా ఉందనీ ఆయన తెలిపారు.

రచయిత నరసింగరావు కన్నుమూత



కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'గులాబి', రామ్‌గోపాల్ వర్మ 'అనగనగా ఒకరోజు' లాంటి పలు హిట్ చిత్రాలకు మాటల రచయితగా పనిచేసిన నడిమింటి నరసింగరావు (72) కన్నుమూశారు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలకు చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

కౌంట్‌డౌన్ మొదలు



ప్రపంచ వ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'పుష్ప 2 ది రూల్' చిత్రం విడుదలకు కౌంట్ డౌన్ మొదలైంది. మరో వంద రోజుల్లో అంటే డిసెంబర్ 6న ఈ సినిమా విడుదల కానుందని మేకర్స్ పేర్కొంటూ పోస్టర్ విడుదల చేశారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్ దర్శకుడు. నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. మరో వైపు నిర్మాణానంతర పనులు కూడా శరవేగంతో జరుగుతున్నాయి. 'కంటెంట్ పరంగానే కాకుండా టెక్నికల్‌గా కూడా 'పుష్ప 2' అత్యున్నత స్థాయిలో ఉండబోతోంది. మీరు ఎంత ఎక్స్‌పెక్ట్ చేసినా అంతకు మించి 'తగ్గేదేలే' అనిపించే రీతిలో సినిమా ఉంటుంది' అని దర్శకనిర్మాతలు చెప్పారు. దేవిశ్రీప్రసాద్ పాటలు అలరిస్తాయని తెలిపారు.

అందరి పేర్లు బయటపెట్టాలి



మలయాళ చిత్ర ప్రముఖులపై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఎఫ్‌ఈఎఫ్‌కేఏ (ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ) దర్శకుల సంఘం ఓ కీలక ప్రకటనను విడుదల చేసింది. జస్టిస్ హేమ కమిటీ నివేదికలో లైంగిక వేధింపులకు పాల్పడిన అందరి పేర్లను బయట పెట్టాలంటూ ఎఫ్‌ఈఎఫ్‌కేఏ దర్శకుల సంఘం డిమాండ్ చేసింది. "ప్రస్తుతం ఈ విషయం కోర్టులో ఉన్నందున దీనిపై ఎక్కువ మాట్లాడాలనుకోవడం లేదు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ అందరి పేర్లు బయటకి రావాలి. దోషులకు కఠిన శిక్ష పడాలి. నిందితులలో మా సంఘం సభ్యులున్నా.. మేం కలుగజేసుకోం" అని పేర్కొంది.

సిద్ధిఖీపై కేసు

మలయాళ నటుడు సిద్ధిఖీపై నటి రేవతి సంపత్ లైంగిక ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీపై పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. అలాగే, బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర చేసిన ఆరోపణల నేపథ్యంలో దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగు ఇండస్ట్రీలో మరీ ఎక్కువ

నటి షకీలా తెలుగు, తమిళ ఇండస్ట్రీలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. "లైంగిక వేధింపులు కేవలం మలయాళ చిత్రసీమలోనే కాదు.. తమిళ ఇండస్ట్రీలోనూ ఉన్నాయి. తెలుగు ఇండస్ట్రీలో అయితే మరీ ఎక్కువగా ఉన్నాయి. అడ్జస్ట్‌మెంట్లు, కమిట్‌మెంట్ల గురించి మేనేజర్లు ముందే అడుగుతారు" అని ఆరోపించారు.

నోరు విప్పితే ట్రబుల్‌మేకర్స్ ముద్ర

హేమ కమిటీ రిపోర్ట్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ నటి స్వర భాస్కర్. "హేమ కమిటీలో వెలువడిన చీకటి వాస్తవాలు చూసి షాకయ్యా. బాధితులు ఎవరైనా ఏ విషయంపై అయినా నోరు తెరచి మాట్లాడితే వారిని ట్రబుల్‌మేకర్స్‌గా ముద్ర వేస్తారు" అని స్వర భాస్కర్ పేర్కొన్నారు. ప్రతి పరిశ్రమలోనూ మహిళలు ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొంటున్నారని నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ అన్నారు. వేధింపులను వెలుగులోకి తెచ్చేందుకు హేమ కమిటీ రిపోర్ట్ ఉపయోగపడిందన్నారు. ఈ నివేదిక మనలో మార్పు తీసుకురావాలి అని ఆమె ఆకాంక్షించారు.

ఇన్ ప్రోగ్రెస్

గన్నా.. గర్ల్!



శ్రీ సింహా కోడూరి, సత్య ప్రధాన పాత్రధారులుగా రూపొందిన 'మత్తు వదలరా' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. రితేశ్ రానా దర్శకత్వంలో చిరంజీవి(చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా నిధి పాత్ర పోషిస్తున్నారు. గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో ఉన్న ఫరియా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. సునీల్, వెన్నెల కిశోర్, అజయ్, రోహిణి తదితరులు నటించిన ఈ చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది.

సెప్టెంబర్‌లో జిగేల్



త్రిగుణ్, మేఘనా చౌదరి జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ 'జిగేల్'. మల్లి యేలూరి దర్శకత్వంలో డాక్టర్ వై జగన్ మోహన్, నాగార్జున అల్లం నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. 'సెప్టెంబర్‌లో 'జిగేల్' చిత్రాన్ని విడుదల చేస్తాం. యువతను ఆకట్టుకునే కథతో తెరకెక్కుతోంది' అని నిర్మాతలు చెప్పారు. రఘుబాబు, పృథ్వీ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఆనంద్ మంత్ర

నీలి మేఘములలో...



రానా దగ్గుబాటి సమర్పణలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రలు పోషించిన '35 చిన్న కథ కాదు' చిత్రం సెప్టెంబర్ 6న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. నందకిశోర్ ఈమని దర్శకత్వంలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్నారు. లీడ్ పెయిర్ జర్నీని అందంగా ఆవిష్కరిస్తూ భరద్వాజ్ గాలి రాసిన 'నీలి మేఘములలో' పాటను బుధవారం విడుదల చేశారు. వివేక్ సాగర్ ఈ గీతానికి స్వరాలు అందించారు.

ప్రేమికుడి వీక్షణం



యువ కథానాయకుడు రామ్ కార్తీక్ హీరోగా, కశ్వి హీరోయిన్‌గా నటించిన 'వీక్షణం' చిత్రం తొలి కాపీతో విడుదలకు సిద్ధమైంది. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి.పద్మనాభరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బుధవారం సిద్ శ్రీరామ్ పాడిన 'ఎన్నెన్నో' పాటను విడుదల చేశారు. ప్రేమలో మునిగిన ప్రేమికుడి మనసుని ఆవిష్కరించే ఈ పాటను రెహ్మాన్ రాయగా, సమర్థ్ గొల్లపూడి స్వరాలు సమకూర్చారు.

సాధనకు దీక్ష అవసరం



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'దీక్ష' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. కిరణ్ కుమార్, అలేఖ్యారెడ్డి జంటగా నటించిన ఈ చిత్రాన్ని పినిశెట్టి అశోక్‌కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం.. అనే పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించాం.' అని కోరారు. ఒక మంచి సినిమాలో అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు హీరో, హీరోయిన్లు కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు పలుకు.. తేనెలొలుకు



- వ్యవహారిక భాషను ప్రవేశపెట్టిన గిడుగు
- నేడు మాతృభాష దినోత్సవం

రాజాం రూరల్, ఆగస్టు 28: మాతృభాషలో మాట్లాడడమే నాకు మహదానందం అంటూ తెలుగులోనే అందరూ మాట్లాడాలని మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు కోరేవారు.. దేశ భాషలందు తెలుగు లెస్స.. అని విజయనగర రాజులు కృష్ణదేవరాయలు చాటారు.. తెలుగుజాతి మనది..నిండుగ వెలుగు జాతి మనది... అమ్మలోని కమ్మదనం చక్కని తేడుపెరుగు తెలుగు... ఘనకీర్తి పొందిన తెలుగు తీయదనం మనది.. అంటూ వివిధ కవులు తెలుగు గురించి అపూర్వంగా వర్ణించారు. మాతృభాషను నేర్వలేనివాడు ఇతర భాషలను సంపూర్ణంగా నేర్చుకోలేరని కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ మాటలు అక్షరసత్యాలు. తెలుగు సాహిత్యంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి గ్రాంధిక స్థానంలో వ్యవహారిక భాషను ప్రవేశపెట్టిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి రోజునే మాతృభాషా దినోత్సవం జరుపుకుంటున్నాం.

ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్..

తెలుగు భాషను ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్‌గా వెనిస్ దేశస్థుడు నికోల్ డీ కంటి అభివర్ణించారు. తెలుగు భాషలో ప్రతి వాక్యం అచ్చు శబ్దంతో ముగుస్తుంది. ఈ ప్రత్యేకత ఇటలీ భాషకు మాత్రమే ఉంది. అందుకే ఇటలీ, తెలుగు భాషలను అజంత భాషలంటారు. ఇతర భాషలన్నీ హల్లు శబ్దంతో అంతమవుతాయి.

ఆంగ్లమే ప్రాధాన్యం కాదు..



పోటీ ప్రపంచంలో ఆంగ్లం తప్పనిసరి. అంతమాత్రాన తెలుగును విస్మరించ కూడదు. మాతృభాషలో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారు వేలల్లో ఉన్నారు. తమిళనాడు ప్రభుత్వం మాతృభాషను అమలు చేయడంలో ఎంతో ఆదర్శంగా నిలిచింది. మనం కూడా అదేమార్గాన్ని అనుసరించాలి. ఇళ్లల్లో పిల్లలు అమ్మా, నాన్నా అనడమే మానేశారు. ఇది చాలా బాధాకరం.

-రంగనాథం, విశ్రాంత తెలుగు పండితుడు, రాజాం

పోతన భాగవతంపై ఊరూరా ప్రచారం..




బొబ్బిలి ఆగస్టు 28: రాముడువలసకు చెందిన **బోదనపల్లి గౌరీన్నసింహ ప్రసాదశర్మ** ఊరూరా పోతన భాగవతాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈయన తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచారపరిషత్ తరపున ఉపన్యాసకులుగా కూడా వ్యవహరిస్తున్నారు. పామరులకు సైతం సులభంగా అర్థమయ్యే రీతిలో పోతనామాత్యులు భాగవతాన్ని ఆంధ్రీకరించారని నిరంతరం నేటి తరం యువకులకు గుర్తుచేస్తుంటారు. తెలుగుభాష ఔన్నత్యాన్ని, మాధుర్యాన్ని, గొప్పతనాన్ని గ్రామీణ ప్రాంతాలు, విద్యాసంస్థల్లో విస్తృతంగా చాటి చెబుతున్నారు. ఇందుకుగాను ఆయనకు టీటీడీ 2015లో ప్రత్యేక అవార్డును ప్రదానం చేసింది.

తెలుగుపై ఎన్నో రచనలు..



బొబ్బిలి పట్టణంలోని నాయుడుకాలనీకి చెందిన **మీసాల చినగౌరునాయుడు** ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో లెక్కలు మాస్టారుగా పనిచేస్తున్నారు. తెలుగుభాషపై అమితమైన ప్రేమ, అభిమానంతో అనేక రచనలు చేస్తున్నారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లో పలు అవార్డులు అందుకున్నారు. స్వతహాగా కళాకారుడు అయిన గౌరునాయుడు తెలుగుభాష అజరామరమైనదని, ఆ భాష ఔన్నత్యం ప్రపంచస్థాయిలో గుర్తించబడిందన్నారు.



ఆకట్టుకుంటున్న చంద్రరావు కార్టూన్..

కొత్తవలస, ఆగస్టు 28: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కంటకాపల్లి గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రేమచంద్రరావు తెలుగుభాష పరిస్థితిపై కార్టూన్ వేశారు. ఇంగ్లీష్ భాష మోజులో పడి తెలుగు భాషను తెలుగు వారు సైతం విస్మరిస్తున్నారని, అమ్మ భాష తెలుగును కాపాడుకోవాలంటూ పిలుపునిస్తూ కార్టూన్‌ను చిత్రీకరించారు.

← తెలుగు భాషపై చంద్రరావు కార్టూన్

హత్య కేసులో ఆరుగురికి యావజ్జీవం

బెలగాం: ఓ హత్య కేసులో ఆరుగురు నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు తీర్పు వెల్లడించారని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018లో యామక గౌరీశంకర్‌ను ఆయన భార్య సరస్వతి కొంతమంది వ్యక్తులతో కలిసి తోటపల్లి ఐటీడీఏ పార్క్ వద్ద పథకం ప్రకారం హత్య చేయించిందని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని పేర్కొన్నారు. పోలీసుల దర్యాప్తులో నిందితులు పథకం ప్రకారం హత్య చేయించినట్లు నేరం రుజువు కావడంతో భార్యతో పాటు ఆరుగురికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.1100 చొప్పున జరిమానా కోర్టు విధించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భోగాపురం: డెంకాడ మండలంలోని జొన్నాడకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గొలగాన అప్పలరాజు(51) మంగళవారం రాత్రి చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ తవుడు తెలిపారు. ఏఎస్ఐ కథనం మేరకు.. డెంకాడ మండలంలోని జొన్నాడ పంచాయతీ మన్యాలపేట గ్రామానికి చెందిన గొలగాన ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దాకమర్రికి చెందిన చెల్లూరుసంతోష్‌కు సిమెంట్ ఇటుక బ్రిక్స్ నిర్వ హిస్తున్నాడు. భోగాపురం మండలంలోని లింగాలవలసకు సిమెంట్ ఇటుకలు పంపి ంచవలసి ఉంది. అయితే సిమెంట్ బ్రిక్స్ ట్రాక్టర్‌కు చెందిన డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో ఆప్‌టింగ్ డ్రైవర్ గొలగాన అప్పలరాజుతో ఈనెల 21న లోడుతో కూడిన ట్రాక్టర్‌ను డెంకాడ మండలంలోని జొన్నాడ నుంచి భోగాపురం మండ లంలోని లింగాలవలసకు పంపించారు. ఆ సమయంలో శ్రీకా కుళం నుంచి విశాఖ వైపు వెళ్లె సర్వీస్ రహదారిలో ట్రాక్టర్ లింగాలవలస వైపు వెళ్తోంది. అదే రహదారిలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వైపు సర్వీస్ రహదారిలో ఆటో వ స్తోంది. అయితే లింగాలవలస సమీపంలో సర్వీస్ రహదారిలో ఆటో ఎదురుగా రావడంతో ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్ ఇంజన్ కింద అప్పలరాజు పడిపోవడంతో తీ వ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వాసుపత్రిలో చేర్చా రు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అప్పలరా జు అక్కడ చిక్సి పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. అప్పలరాజుకు భార్యఅప్పయ్యమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ట్రాక్టర్ యజమాని చెల్లూరు సంతోష్ ఫిర్యాదు మేరకు సీఐ ఎస్వీ ప్రభాకరరావు ఆదేశాల మేరకు కేసు నమోదుచేశారు.

గరుడబిల్లిలో ఒకరి ఆత్మహత్య

బొండపల్లి: భార్య మందలించిందని మనస్తాపంతో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ మ హేష్ బుధవారం తెలిపారు. మండలంలో గరుడబిల్లి గ్రామా నికి చెందిన మజ్జి శ్రీదేవి తన భర్త శ్రీరామ్‌ను మద్యం తాగి రావడంతో బుధవారం మందలించిందని తెలిపారు. మనస్తాపానికి గురైశ్రీరామ్ పురుగుల మందు తాగినట్లు చెప్పారు. ఈమేరకు ఆసుపత్రికిలో చికిత్స పొందు తూ శ్రీరామ్ మృతిచెందినట్లు తెలిపారు. శ్రీరామ్‌కు కుమారుడు, కుమార్తె ఉ న్నారు. ఈ మేరకు ఎస్ఐ యు.మహేష్ కేసు నమోదుచేశారు.

నలుగురికి గాయాలు

కొమరాడ/కురుపాం: కొమరాడ మండలంలోని కెమిశీల నుంచి కురుపాం వస్తున్న ఆటో, కెమిశీల వైపు వెళ్తున్న ఆటో తులసివలస గ్రామ సమీపంలో ఎదురె దురుగా ఢీకొనడంతో నలుగురు గాయపడ్డారు. మాదలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే జూమ్ మీటింగ్‌కు వెళ్తున్న గుణద, బిన్నిడి, గుణద తీలేసు ఆశా కార్యకర్తలు ఎం.లక్ష్మి, ఎం.మిం దమ్మ, కిడగమ్మ, కురుపాం వెళ్లేందుకు ఆటో ఎక్కిన గొరడ గ్రామానికి చెందిన చంద్రయ్య గాయపడ్డారు. కురుపాం పీహెచ్‌సీకి తరలించగా అక్కడి పోలీసులు కేసు నమోదుచేశారు. కాగా ఈ మేరరకు కొమరాడ ఎస్ఐ నీలకంఠం కేసు నమోదుచేశారు.

అంతర్ జిల్లాల దొంగ అరెస్టు

- ఒంటరి మహిళలను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడిన వైనం

గాజువాక (విశాఖపట్నం), ఆగస్టు 28: ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసుకుని వారిని మాయ మాటలతో నమ్మించి మత్తు మందు ఇచ్చి నగదు, బంగారు ఆభరణాలను కాజేస్తున్న కొట్టిన లక్ష్మణనాయుడు అనే అంతర్ జిల్లాల దొంగను విశాఖలోని గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 24న వడ్లపూడి ప్రధాన మార్గంలో కూరగాయలు విక్రయించే ఓ మహిళ వద్దకు లక్ష్మణనాయుడు వచ్చి మాటలు కలిపాడు. అనంతరం అక్కడ ఉన్న షాపు నుంచి చెరకు రసం తెచ్చి ఆమెకు ఇచ్చాడు. అది తాగాక ఆమె ఇంటికి వెళ్లి అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. ఆ మర్నాడు ఉదయం లేచి చూసేసరికి ఆమె మెడలో ఉండాల్సిన బంగారు గొలుసు, ఇతర ఆభరణాలు, బీరువాలోని బంగారు వస్తువులు, నగదు, ఏటీఎం కార్డు కనిపించలేదు. దీంతో తమ ఇంట్లో రాత్రి దొంగతనం జరిగిందంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇటువంటి నేరాలు ఇటీవల నగరంలో అధికమవుతున్నట్టు గుర్తించిన పోలీస్ ఉన్నతాధికారులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. క్రైమ్ డీసీపీ సీహెచ్ శ్యామలరావు, సౌత్ డివిజన్ క్రైమ్ సీఐ కె.శ్రీనివాసరావులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. కూరగాయల దుకాణం వద్దకు వ్యక్తి గురించి ఆరా తీశారు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడు శ్రీకాకుళం జిల్లా పాలకొండ సమీపంలోని బాసుర ప్రాంతానికి చెందిన కొట్టిన లక్ష్మణనాయుడుగా గుర్తించారు. ఈ క్రమంలో లక్ష్మణనాయుడు మంగళవారం ఇక్కడి రాజీవ్‌నగర్ బ్రిడ్జి వద్ద ఉన్నట్టు పోలీసులు గుర్తించి అదుపు లోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుని వద్ద నుంచి బంగారు చైను, మూడు తులాల ఇతర ఆభరణాలు, కొన్ని ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇప్పటికే నిందితుడిపై గాజువాక, పెందుర్తి, విశాఖ టూ టౌన్, విజయనగరం, కాకినాడ జిల్లా సామర్లకోట, అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట, శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాయి.

ఇసుక అక్రమరవాణాను ఉపేక్షించేదిలేదు

బొబ్బిలి: ప్రభుత్వ ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడిచే విధంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి సీఐ కటకం సతీష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అలజంగి, కారాడ, పారాది తదితర వేగావతి నదీ పరివాహక ప్రాంతాలలో ఇసుక అక్రమ రవాణా అవకుండా గట్టి నిఘా పెట్టామన్నారు. అర్ధరాత్రివేళల్లో ఎటువంటి అక్రమరవాణా జరిగినా వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. స్థానిక గ్రోత్‌సెంటరులో గల ప్రభుత్వ ఇసుకస్టాకు పాయింట్‌లో వాహనాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా ఇసుకపంపిణీ జరిగేలా గట్టి చర్యలు తీసుకున్నామన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న దృశ్యం

రాజాం రూరల్: రాజాం రూరల్ సర్కిల్ పరిధిలోని రేగిడి, వంగర, సంతకవిటి పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన సుమారు రూ.5 లక్షలు విలువ చేసే మద్యం, సారాను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సమక్షంలో రూరల్‌స్టేషన్ పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో బీవీజీ రాజు అందజేసిన సమాచారం ప్రకారం 50 బీర్లు, 30 లీటర్ల నాటుసారా, 900 మద్యం బాటిళ్ల ధ్వంసం చేసినవాటిలో ఉన్నాయి.

రేపు ఓం సదనంలో లక్ష కుంకుమార్చన

కొత్తవలస: శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా ఈ నెల 30న తుమ్మికాపల్లి గేట్ సమీపంలోని ఓం సదనంలో లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సదనం అర్చకుడు అంపోలు కిరణ్ కుమార్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచి జరుగుతుందని, మహిళలు అధిక సంఖ్యలో హాజరై కుంకుమార్చనలో పాల్గొనాలని కోరారు.

రేపు విద్యుత్ కోత

లక్కవరపుకోట: మండల కేంద్రమైన ఎల్.కోట విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఖాసాపేట ఫీడర్‌లో విద్యుత్ కోతలు అమలు చేస్తున్నట్టు విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు.

నేడు గ్రామసందర్శన

లక్కవరపుకోట: మండలంలోని గేదెలవానిపాలెంలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం జరుగనుందని ఈవోపీఆర్డీ జ్ఞానేశ్వరరావు తెలిపారు. మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని కోరారు.

దేవీబొమ్మ కూడలిలో పోలీస్ బీట్

శృంగవరపుకోట: శృంగవరపుకోట దేవీబొమ్మ కూడలిలో బుధవారం పోలీస్ బీట్‌ను సీఐ వీ.ఎన్ మూర్తి ప్రారంభించారు. ఈ పోలీస్ బీట్‌లో ట్రాఫిక్ కంట్రోల్ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనికి సహక రించిన స్థానికులను అభినందించారు. గతంలో ఉన్న ఈ పోలీస్ బీట్ పాడవడంతో స్థానిక దుర్గాదేవి లైటింగ్ సప్ల యిర్స్ సహకారం అందించారు. ఎస్.ఐ గంగరాజు వున్నారు.

మరియాదాసుకు నివాళులు

శృంగవరపుకోట: శృంగవరపుకోట బాపూజీ సేవా సంఘ వ్యవస్థాపకుడు మోపాడ మరియాదాస్‌కు సంఘ సభ్యులు బుధవారం నివాళులు అర్పించారు. చిత్రపటానికి పూలమాలలు అర్పించారు. ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి రోగులకు రొట్టెలు, పాలు అందించారు. మండల టీడీపీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, స్వామినాయుడు, మోపాడ చిన్ని కృష్ణ, వసంత సత్యారావు ఉన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

రాజాం: భారతీయ జనతా పార్టీ ప్రీ సభ్యత్వాలు నమోదు కార్యక్రమం సెప్టెంబరు రెండో తేదీ నుంచి చేపడుతుందని ఈ కార్యక్రమం విజయవంతం చేసేలా పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని పట్టణ మండల అధ్యక్షుడు జొన్నాడ రంజిత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు పిలుపునిచ్చారు. రాజాం నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు సభ్యత్వ నమోదును చేయించు కోవాలని ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

పూర్తి అదనపు బాధ్యతలతో ఎస్టీవో

బొబ్బిలి: బొబ్బిలి సబ్‌ట్రెజరీ అధికారిగా ముదిలి ఆదినారాయణ పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు. ఇక్కడ ఎస్టీవోగా పనిచేసిన లక్కోజు సత్యనారాయణను పాడేరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయనగరం ఎస్టీవోగా పనిచేస్తున్న ఆదినారాయణను ప్రభుత్వం ఇక్కడ నియమించింది.

అక్టోబరులో విద్యా వైజ్ఞానిక మహాసభలు

బొబ్బిలి: మూడు రోజుల పాటు అక్టోబరు 6 నుంచి విజయనగరంలో ఏపీటీఎఫ్ విద్యావైజ్ఞానిక మహాసభలు నిర్వహించనున్నట్లు జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ఎం.బలరామనాయుడు తెలిపారు. బుధవారం రాత్రి బొబ్బిలిలో ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 14న బొబ్బిలిలో ఏపీటీఎఫ్ ప్రాంతీయ విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తామని, ఇందుకోసం అవసరమైన అనేకాంశాలపై సమావేశంలో చర్చించారు. ఏపీటీఎఫ్ నాయకులు సన్యాసినాయుడు, వెంకటనాయుడు, గంట సత్యనారాయణ, రామారావు, సత్యారావు పాల్గొన్నారు.

రైతులు సంఘంగా ఏర్పడితే ప్రయోజనాలు

శృంగవరపుకోట రూరల్: గ్రామాల్లో ఉండే రైతులు ఒక రైతు సంఘంగా ఏర్పడితే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని నాబార్డు డీడీఎం నాగార్జున అన్నారు. మండలంలోని తిమిడి గ్రామంలో ఎస్.కోట రైతుభారత్ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతు సంఘం సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. నాగార్జున మాట్లాడుతూ రైతుసంఘం ప్రయోజనాలు, విస్తరణ ఆవశ్యకత, రైతుభారత్ విజ యాలు, భవిష్యత్ ప్రయోజనాలు వంటి విషయాలు వివరించారు.

హామీ లేకుండానే ముద్ర రుణాలు

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 28: బ్యాంకులకు ఎటువంటి హామీ చూపించకుండానే ముద్ర రుణాలు పొందవచ్చునని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు పొందవచ్చునని కలెక్టర్ అంబేడ్కర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం కింద శిశు విభాగంలో రూ.50 వేల వరకూ, కిషోర్ విభాగంలో రూ. 5 లక్షల వరకూ, తరుణ్ విభాగం కింద రూ.10 లక్షల వరకూ ముద్ర రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. చిరు వ్యాపారులకు చిన్న, చిన్న యూనిట్లు స్థాపించే వారికి ముద్ర రుణాలు ఎంతో ప్రయోజనకరమన్నారు. పీఎం ఈజీపీ మంజూరు చేసే ఈ పథకం కింద 400 మందికి వెంటనే యూనిట్స్ స్థాపించాలని ఆదేశించారు. భూములు సాగు చే స్తున్నవారికే పంట రుణా లు మంజూరు చేయాలని, వన మహోత్సవ కార్యక్రమంలో బ్యాంకర్లు కూడా భాగస్వా ములు కావాలన్నారు. జేసీ సేతు మాధవన్, ఎల్‌డీఎం రమణమూర్తి, నా బార్డు డీడీఎం నాగార్జున, ఎల్‌డీవో సునీ ల్, మెప్మా పీడీ సుధాకరరావు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

నిబంధనల మేరకు ఈవీఎంల రీ వెరిఫికేషన్

కలెక్టరేట్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో విజయనగరం పార్లమెంటు పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు చెకింగ్, రీ వెరిఫికేషన్ ప్రక్రియ ఆగస్టు 26 నుంచి 28 వరకూ నెల్లిమర్లలోని జిల్లాస్థాయి ఈవీఎం గౌడ‌న్‌లో నిర్వహించామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు బొత్స అప్పలనర్సయ్య, బెల్లాన చంద్రశేఖర్ ఈవీఎంల చెకింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఎన్నికల కోసం దరఖాస్తు చేసిన మీదట జిల్లాలోని విజయనగరం పార్లమెంటు పరిధిలోని గజపతినగరం, బొబ్బిలి, నెల్లిమర్ల నియోజకవర్గాల్లోని మూడు పోలింగు బూత్‌లకు చెందిన ఈవీఎంలు చెకింగ్ రీవెరిఫికేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 26న గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ప్రక్రియకు దరఖాస్తు చేసిన అభ్యర్థి బొత్స అప్పలనర్సయ్య తరపున బెల్లాన వంశీ ఏజెంట్‌గా హాజరై మాక్ పోలింగులో పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి 1,400 ఓట్లు నమోదు చేయడంతో పాటు, ఓటింగ్ అనంతరం వీవీ ప్యాట్‌లు లెక్కింపు చేపట్టగా, ఈవీఎంల్లో వచ్చిన ఫలితాన్ని పరిశీలించి వాటి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారని రాత పూర్వకంగా ఈ విషయాన్ని తెలిపారన్నారు. 27న బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 9 పోలింగ్ కేంద్రం రీ వెరిఫికేషన్ ప్రక్రియకు దరఖాస్తు చేసిన అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ స్వయంగా హాజరయ్యారన్నారు. తాను ఈవీఎం మాక్ పోలింగును కోరలేదని, చార్జింగ్ విషయంలో సందేహం ఉందన్నారు. వాటిని నివృత్తి చేయాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం మాత్రమే తనిఖీ ప్రక్రియ చేపట్టగలమన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థి తనకు ఆసక్తి లేదంటూ తెలియజేసి నిష్క్రమించడంతో మాక్ పోలింగ్ కొనసాగించలేదన్నారు. ఈ నెల 28న నెల్లిమర్ల అసెంబ్లీ సిగ్మెంట్ పరిధిలో వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టగా, అభ్యర్థి తరపున ఏజెంట్‌గా బెల్లాన వంశీ హాజరయ్యారని, తాము ఈవీఎం మాక్ పోలింగు కోరలేదన్నారు.

పర్యావరణ పరిక్షణ అందరి బాధ్యత

రామభద్రపురం: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మాజీ జిల్లా బోర్డు మెంబరు, కీర్తిశేషులు చొక్కాపు అప్ప లనాయుడు జ్ఞాపకార్థం వారి కుమారులు నిర్మించిన బస్సు షెల్టర్‌ను ప్రారంభిం చారు. అనంతరం ఆ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని కోరారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు, తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కరణం విజయభా స్కర్, చొక్కాపు రామారావు, జనసేన నాయకులు మహంతి ధనంజయరావు, తె లుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న బేబీనాయన

మత్తు పదార్థాలపై అవగాహన

బాడంగి: మత్తు పదార్థాలపై స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు బొబ్బిలి సీఐ నాగేశ్వరరావు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేసుల్లో పట్టుబడితే 10 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారని తెలిపారు. వీటికి అలవాటు పడి దొంగతనాలు, హత్యలు చేసే అవకాశం ఉందన్నారు. అందుకే విద్యార్థి దశ నుంచే బాగా చదువు కుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామదాసు, ఎస్ఐ తారకేశ్వరరావు, ఏఎస్ఐ కొండలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

విజయనగరం క్రైం: రహదారి భద్రతా నియామాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ట్రాఫిక్ సీఐ సూరినాయుడు సూచించారు. బుధవారం నగరంలోని ఏజీఎల్, నారాయణ కళాశాల విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని, వాహన పత్రాలతో పాటు, లైసెన్సు తప్పనిసరిగా కలిగి వుండాలని అన్నారు. మైనర్లు వాహనాలతో పట్టుబడితే, సీజ్ చేస్తామని హెచ్చరించారు.. అతి వేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరమని మైనర్ నిండిన వారు రవాణాశాఖ కార్యాలయం ద్వారా లైసెన్సు పొందాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో ఎస్ఐ లోవ రాజు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయండి

బొబ్బిలి: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను వారి ఇళ్ల నుంచే పరిష్కరించుకోవచ్చని సమస్యల పరిష్కార న్యాయస్థానం (ఏపీఈపీడీసీఎల్-సీజీ ఆర్ఎఫ్) చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక విద్యుత్ కార్యాల యంలో బుధవారం వినియోగదారుల సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొనే సమస్యలపై 1912 కాల్‌సెంటరుకు ఫిర్యాదు చేయాలన్నారు. అక్కడ పరి ష్కారం లభించకపోతే తమను ఆన్‌లైన్‌లో ఆశ్రయించవచ్చన్నారు. వినియోగదా రులకు ఎటువంటి ఖర్చులేకుండానే వారి ఫిర్యాదులపై పరిష్కారం చేస్తామ న్నారు. తాము చూపిన పరిష్కారానికి సంబంధించి 60 రోజుల్లోగా ఆర్డర్ కాపీ ఇస్తామని తెలిపారు. వినియోగ దారులు తాము ఎదుర్కొనే సమస్యలలో బిల్లింగ్ లోపాలు, తీగలు, కేబుల్స్ మర మ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు కాలిపో వడం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, మీటర్లలో లోపాలు, అదనపు లోడు మంజూరు, కేట గిరి ఇతర అంశాల మార్పులు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ వంటి వాటిని తమ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. వేదిక సభ్యులు వీ జనార్దన్‌రావు, ఈఈలు ఆ వాల అనంతరావు, ధర్మరాజు, డీఈలు ఉదయభాను, శ్రీనివాసరావు ఉన్నారు.



సమస్యలను పరిష్కరిస్తున్న వేదిక చైర్మన్ సత్యనారాయణ

అభివృద్ధి పథంలో ప్రజా ప్రభుత్వం: కోండ్రు

రాజాం/సంతకవిటి: అభివృద్ధి పథంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం చీపురుపల్లి రోడ్డులో ఒకప్రైవేటు కార్యక్రమంలో పాల్గొని అనంతరం సంతకవిటి మండలం మండాకురిటి పంచాయతీలో నూతన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజా గ్రంథాలయ నూతన భవనాన్ని ప్రారంభించి అనంతరం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. పార్టీ నాయకులు కొల్ల అప్పలనాయుడు, గురవాన నారాయణరావు, శాసపు రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న కోండ్రు

సెంట్రల్ జోన్, సౌత్ జోన్ జట్ల ఆధిక్యం

విజయనగరం టౌన్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న ఇంటర్ జోన్ పురుషుల సీనియర్ క్రికెట్ మల్టీ డే పోటీల్లో సెంట్రల్ జోన్, సౌత్ జోన్ జట్లు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో తమ ప్రత్యర్థి జట్లపై విజయాలు అందుకున్నాయి. జిల్లా కేంద్రంలోని విజ్జీ క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్, రెస్టాఫ్ ఆంధ్ర జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రెస్టాఫ్ ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 85.5 ఓవర్లలో 333 పరుగులకు ఆలౌట్ కాగా, సెంట్రల్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 98.5 ఓవర్లలో 456 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో సెంట్రల్ జోన్ జట్టుకు 123 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన రెస్టాఫ్ ఆంధ్ర జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 38.5 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 169 పరుగులు సాధించింది.

- డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో సౌత్ జోన్- నార్త్ జోన్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో సౌత్‌జోన్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో 3 పాయింట్లు లభించాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన సౌత్ జోన్ జట్టు 123.3 ఓవర్లలో 444 పరుగులకు ఆలౌట్ కాగా, నార్త్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 51.5 ఓవర్లలో 187 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో సౌత్ జోన్ జట్టుకు 257 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్ జట్టు మూడు రోజు ఆట ముగిసే సమయానికి 41 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 153 పరుగులు సాధించింది.

చీపురుపల్లికి బస్ సౌకర్యం కల్పించండి

● గర్భాంలో విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

గరివిడి: మెరకముడిదాం మండలం నుంచి వయా గర్భాం మీదుగా చీపురుపల్లికి బస్ సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరారు.ఈ మేరకు గర్భాంలో బుధవారం నాడు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గరివిడి మండలం నుంచి వందలాది మంది విద్యార్థులు చీపురుపల్లి, గరివిడి పట్టణాలలో గల కళాశాలలో చదువుతున్నారని తెలిపారు.బస్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకుడు కిమిడి రామ్ మల్లిక్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని అయన హామీ ఇచ్చారు.

నేడు గ్రామసందర్శన

గజపతినగరం: పిడిశీలలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ సం దర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాసమస్యలను తెలుసుకోనున్నట్లు పేర్కొన్నారు.

నేడు బీజేపీ కార్యవర్గ సమావేశం

గజపతినగరం: బీజేపీ కార్యవర్గ సమావేశం గురువారం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, నియోజకవర్గ సమన్వయకర్త దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

నూతన హెల్త్‌పాలసీపై హర్షం

గజపతినగరం: ప్రజలకు మరింత మంచి వైద్యసేవలు అందించాన్న ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకంస్థానంలో నూతనంగా హెల్త్ బీమాపాలసీని తీసుకురావడంపై ఎన్టీఆర్ వైద్యసేవ వైద్యమిత్రల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జె.ప్రదీప్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఆరోగ్యశ్రీ ఉద్యోగులను ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆప్కాస్ పరిధిలో ఉంచాలని కోరారు. ఇక నుంచి ఆరోగ్యశ్రీ సేవలు హైబ్రీడ్ విధానంలో అందించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు.

సాఫ్ట్ బాల్‌లో సత్తాచాటిన తూడెం విద్యార్థులు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

భోగాపురం: మండలంలోని తూడెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్‌లో సత్తాచాటారు. ఈ మేరకు శ్రీకాకుళంలో ఈనెల 17నుంచి 19వ తేదీ వరకు జరిగిన 11వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పదో తరగతి విద్యార్థి సీహెచ్ సాత్విక్, తొమ్మిదో తరగతి విద్యార్థులు కె.ఇందు, డి.దుర్గాదేవి బంగారు పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయుడు వి.అప్పన్న తెలిపారు. సత్తాచాటిన విద్యార్థులను పీడీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

కుక్క దాడిలో ఉపాధ్యాయునికి గాయాలు

దత్తిరాజేరు: దత్తిరాజేరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు డోకుల రమేష్‌పై కుక్క దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా ఇటీవల వీధికుక్కల బెడద పెరిగిందని, గ్రామంలో దాడిచేస్తున్నాయని పలువురు వాపోతున్నారు.

రోడ్డుపై గోతులు.. రాకపోకలకు బేజారు

●దత్తి నుంచి భోజరాజపురం రహదారి దుస్థితి



అధ్వానంగా ఉన్న దత్తి-భోజరాజపురం రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని దత్తి నుంచి భోజరాజపురం గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా గోతులమయం కావడంతో రాకపోకలకు అవస్థలుపడుతున్నారు.ఈ మార్గంలో చీకటిపడిన తర్వాత ద్విచ క్రవాహనాలు బోల్తాపడుతున్నాయని పలువురు వాపోతున్నారు. రోగులను ఆస్పత్రికి తరలించే, అత్యవసర సమయాల్లో మరింత అవస్థలు తప్పడంలేదు. వర్షాకాలంలో రోడ్డంతా బురదమయంకావడంతో తమకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుల కలయిక

● 55 ఏళ్ల కిందట శిక్షణ పొందిన వారంతా..



ఒకే వేదికపై కలుసుకున్న రిటైర్డు ఉపాధ్యాయులు

నెల్లిమర్ల: నగర పంచాయతీలోని జరజాపుపేటలో రిటైర్డు ఉపాధ్యాయులు బుధవారం కలుసుకున్నారు.శ్రీకాకుళం జిల్లా పలాసలోని ప్రభుత్వ బేసిక్ ఉపాధ్యాయ శిక్షణ పాఠశాలలో 1967-69 బ్యాచ్‌లో శిక్షణ పొందిన వారంతా ఆ తర్వాత ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. సుమారు మూడు దశాబ్దాల కాలం పాటు ఉపాధ్యాయ వృత్తిని నిర్వర్తించి వారంతా ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేశారు. సుమారు వారంతా శిక్షణ పొందిన 55 సంవత్సరాల తర్వాత మళ్లీ జరజాపుపేటలో బుధవారం ఒకే వేదికపై కలుసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. అయితే ఆ బ్యాచ్‌లో 100 మంది శిక్షణ పొందగా 30 మంది హాజరయ్యారు. గత స్మృతులను గుర్తుకు తెచ్చుకుని వారంతా సంబరాలు చేసుకున్నారు. ఇదే బ్యాచ్ విద్యార్థి, జరజాపుపేటకు చెందినరిటైర్డు ఉపాధ్యాయుడు కడలి ప్రకాశరావు ప్రత్యేకంగా ఒక కార్యక్రమం రూపకల్పన చేసి వారందర్ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు సత్యవతమ్మ, రామబ్రహ్మం విగ్రహాలతోపాటు ఇటీవల మృతిచెందిన తన సతీమణి అనసూయ విగ్రహాలను ఆవిష్కరించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



శంకరరావుకు సత్కరిస్తున్న దృశ్యం

మెంటాడ : గుర్ల తమ్మిరాజుపేట ఉపాధ్యాయుడు డాక్టర్ బొంతలకోటి శంకరరావు మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ అవార్డును అందుకోవడంతో ఉపాధ్యాయ సంఘాలు బుధవారం ఘనంగా సత్కరించాయి. ఈ సందర్భంగా మాజీ శాసనమండలి సభ్యులు గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుడుగా, రచయితగా, సాహితీవేత్తగా, గాయకుడిగా బొంతలకోటి శంకరరావు మాస్టారు సమాజానికి బహుముఖ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస్, పీఆర్టీయూ రాష్ట్ర నేత రావాడ రాంబాబు, మెంటాడ ఉపాధ్యాయులు సంఘ నేతలు సిరిపురం కృష్ణ,అల్లాడ రామకృష్ణ, జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రోత్సాహం లేదు.. వసతులు లేవు

● క్రీడల జిల్లాపై అలసత్వం మబ్బులు ● నేడు జాతీయ క్రీడా దినోత్సవం



రాజాంలో శిథిలావస్థకు చేరుకున్న షెడ్

రాజాం రూరల్: జిల్లాలో క్రీడలకు ప్రోత్సాహం కరువవుతోంది. దీనికి తోడు వసతులు కూడా లేవు.క్రీడలపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో ఎందరో మాణిక్యాలు ఇంకా మట్టిలోనే ఉండిపోతున్నారు. ఎంతో చేస్తున్నామని చెప్పుకుంటున్న నాయకులు, అధికారులు ఏమీ చేయకపోవడంతో జిల్లాలోని క్రీడా వైభవం మసకబారిపోతోంది. భారతదేశ క్రీడాముత్యం ధ్యాన్ చంద్ జయంతి పురస్కరించుకుని ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవంగా ఏటా నిర్వహిస్తున్నారు.

● పల్లెల నుంచి అంతర్జాతీయ స్థాయికి..

ఒకప్పుడు పల్లెలు క్రీడలకు పట్టుకొమ్మలుగా ఉండేవి. పల్లెల్లోని ఎందరో ఆణిముత్యాలు అంతర్జాతీయంగా తళుకులీలిన చరిత్ర ఉంది. కానీ నేటి ఆధునిక యుగంలో పరిస్థితులు మారాయి. టెక్నాలజీ వల్ల మనిషి ఆటలకు దూరమవుతున్నాడు. ఉత్సాహం ఉన్న వాళ్లేమో ప్రభుత్వ చర్యలతో ముందుకు రాలేకపోతున్నారు.

● అంతర్జాతీయ ప్రతిభ..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని ఆముదాలవలస పట్టణం జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు వేదికైంది. ఒలింపిక్స్‌లో కాంస్య పతక గ్రహీత, రాజీవ్ ఖేల్‌రత్న, పద్మశ్రీ, అర్జున అవార్డు గ్రహీత కరణం మల్లీశ్వరి, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి, పూజారి శైలజ, కరణం నరసమ్మ, టి.ప్రమీలావల్లి, నీలంశెట్టి గురివినాయుడు తదితరులు అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. రాష్ట్ర, జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచి వందలాది మంది వాలీబాల్ ఆటగాళ్లను రాష్ట్రానికి, దేశానికి పరిచయం చేసిన మహనీయుడు దివంగత రామజోగినాయుడిది నియోజకవర్గ పరిధిలోని రేగిడి మండలం ఉణుకూరు. ఆయన వద్ద శిక్షణపొంది గేమ్స్ కోటాలో ఉద్యోగాలు పొంది దేశంలోని పలు రాష్ట్రాలలో స్థిరపడ్డారు. కానీ ప్రస్తుతం క్రికెట్ మినహాయిస్తే ఇతర ఏ ఆటలకు కూడా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కనిపించడం లేదు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నిస్, బాడ్మింటన్, హైజంప్, లాంగ్‌జంప్, అథ్లెటిక్స్ వంటి గ్రామీణ క్రీడలకు ఆదరణ తగ్గింది. క్రికెట్ తారాస్థాయికి చేరి కూచుంది. గిరిజన ప్రాంతాలలో విలువిద్య, సముద్రతీర ప్రాంతాలలో స్విమ్మింగ్‌ను ప్రోత్సహించడం లేదు.

● ఆటస్థలాల్లేవ్..

పాఠశాలల్లో ఆటస్థలాలు లేవనే చెప్పాలి. శిక్షకులు సరేసరి.. అయిదారు అంతస్తుల్లో నిర్వహిస్తున్న కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలకు విధిగా ఆటస్థలం ఉండాలన్న నిబంధన ఉన్నప్పటికీ రికార్డుల్లో మాత్రమే కనిపిస్తోంది. ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీల నియామకాలూ నిలిచిపోయాయి. ఆడుదాం ఆంధ్రా పేరుతో గత ప్రభుత్వం ఆటలకు తూట్లు పొడిచింది. పార్టీ కార్యక్రమాలుగా నిర్వహించి అబాసుపాలైంది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 2018లో రూ. కోటి వంతన నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించిన మినీస్టేడియంల వైపు గడచిన అయిదేళ్లు అధికార వైసీపీ ప్రభుత్వం కన్నెత్తి చూడకుండా క్రీడాభిమానుల ఆశలపై నీళ్లు జల్లింది. ఫలితంగా లక్షలాది రూపాయల ప్రజాధనం పునాదులు, మొండిగోడల్లో వృథా అయ్యింది.

నిర్వహణ లేక.. మరమ్మతుకు నోచుకోక

●అధ్వానంగా మారిన మురుగు కాలువ ● ఇదీ రాజాంలోని ఆదర్శనగర్ కాలనీలో దుస్థితి



ఆదర్శనగర్ కాలనీలో జనావాసాల్లో నిల్వ ఉన్న మురుగు నీరు

రాజాం: మునిసిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్ కాలనీలో గల మురుగు కాలువ నిర్వహణ, మరమ్మతులులేకపోవడంతో అధ్వానంగా మారింది. జనావాసాల్లోఉన్న ఈ కాలువను మరమ్మతులు చేపట్టాలని మునిసిపల్ అధికారులకు నాలుగేళ్ల నుంచి ఫిర్యాదుచేసినా చర్యలు తీసుకోవడంలేదని కాలనీకి చెందిన ఇట్ల అప్పారావు రమణ, సత్యనారాయణ, భాస్కరరావు పద్మ తదితరులు వాపోతున్నారు.ఫిర్యాదు చేసిన వెంటనే ఏఈని పంపించి పరిశీలించినా ఇంతవరకు నిధులు మంజూరు చేయలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువ నిర్వహణ లేకపోవడంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. చెత్త, మురుగునీటిని చిందరవందర చేయడంతోపాటు కాలువ లోనే పందులు తిష్ట వేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో చీకటిపడిన తర్వాత దోమలతో ఇబ్బందిపడుతున్నామని కాలనీ వాసులు చెబుతున్నారు. తక్షణమే మునిసిపల్ అధికారులు మురుగు కాలువ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా ఆదర్శనగర్‌లోని మురుగు కాలువలను పరిశీలించి, నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని రాజాం మునిసిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. కాలనీ వాసులు పలుసార్లు ఈ విషయంపై దరఖాస్తులు చేసిన విషయం వాస్తవమే చెప్పారు. నిధుల సమస్య వల్ల పనులు చేపట్టలేక పోయామని, ఈ విషయంలో చర్యలు తీసుకొని కాలనీ వాసులకు న్యాయం చేస్తామని తెలిపారు.

సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

● ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అశోక్



సామాజిక ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

నెల్లిమర్ల: కాంట్రాక్టర్లతో తక్షణమే తమకు జాయింట్ మీటింగ్ ఏర్పాటుచేసి కాంట్రాక్ట్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సామాజిక ఆసుపత్రి వద్ద కాంట్రాక్టు సిబ్బంది నల్లరిబ్బన్‌లు ధరించి విధులకు హాజరయ్యారు.ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది గోడు ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల్లో కాంట్రాక్టు కార్మికులగా పని చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు ,సూపర్‌వైజర్లు గత 12 రోజులుగా జీతాల కోసం దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా వారి గోడు జిల్లా వైద్యాధికారులకు వినపడలేదా అని ప్రశ్నించారు. గంట సేపు నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతు విధులు నిర్వర్తించినా అధికారులు బెదిరించడం సమంజసం కాదన్నారు. నిరసన తెలుపుతున్న సమయంలో సెక్యూరిటీ గార్డు మురళి కళ్లు తిరిగి పడిపోవడంతో వెంటనే సామాజిక ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. మురళికి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు.

అఖిల భారత పోటీలకు విద్యుత్ ఉద్యోగి ఎంపిక

నెల్లిమర్ల: నెల్లిమర్ల డీఈఈ ఎ.రామకృష్ణ గాజువాకలో ఇటీవల మూడు రోజుల పాటు జరిగిన విద్యుత్ శాఖ ఉద్యోగుల ఇంటర్ సర్కిల్ స్థాయి చదరంగం పోటీల్లో చాంపియన్ షిప్‌ను సాధించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో అక్టోబర్‌లో జరుగునున్న అఖిల భారత స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణను ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, పి.హరి, జి.శ్రీనివాసన్, వి.మోహన్‌బాబు,ఎ.అప్పలసూరి, పి.పైడిరాజు అభినందించారు

చిన్నశిర్లాం ఎన్నికకు ఏర్పాట్లు

రేగిడి: మండలంలో 81 పాఠశాలలకు గాను రెండు విడతల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తికాగా ఒక్కచిన్నశిర్లాం ఎస్ఎంసీ ఎన్నిక నిలిచిపోయింది. ఈపాఠశాల ఎన్నిక గురువారం నిర్వహించేందకు జిల్లా యంత్రాంగం నోటిఫికేషన్ విడుదల చేయగా, ఇక్కడ పోలీస్ బందోబస్తు, ప్రశాంత ఎన్నిక నిర్వహణకు స్థానిక పోలీస్‌లను ఎంఈవోలు వరప్రసాదరావు, ఏరకయ్య ఆశ్రయించారు. ఈ పాఠశాలల్లో అన్ని తరగతులు ఎన్నిక పూర్తికాగా, ఒక్క 8వతరగతికి ఇటీవల కోరం లేక ఎన్నిక నిలిచిపోగా, ఈపాఠశాల ఎన్నిక నిర్వహణకు విద్యాశాఖ అన్ని చర్యలు చేపట్టినట్లు ఎంఈవోలు తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

బొబ్బిలి రూరల్: మండలంలోని పక్కి గ్రామంలో బుధవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాప్తి, జాగ్రత్తలు తదితర విషయాలపై గ్రామ సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంట పైడిరాజు, ఏఎన్ఎం విజయ, హెచ్‌వో ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఎల్‌డబ్ల్యుఎస్ విజయ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో పనిచే స్తున్న పారిశుధ్యకార్మికులకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇంతవరకు జీతాలు చెల్లింకపోవడం అన్యాయమని, తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బలసా శ్రీనివాసరావు కోరారు. దీనిపై మండల కేంద్రంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 8 నుంచి సాయంత్రం 7 వరకు పాఠశాలలో ఉండి బాత్‌రూములు, మరుగుదొడ్లతోపాటు తరగతి గదులు శుభ్రం చేయడం, రికార్డులు అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నా వారి సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబరు 2న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్లు కారంగి లక్ష్మి, డి.రాజేశ్వరి, రామలక్ష్మి, పద్మ, మంగ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్ అంధకారం

విజయనగరం రూరల్: సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడితే, భవిష్యత్తు అంధకారం అవుతుందని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు తెలిపారు. బుధవారం కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ర్యాగింగ్ నకు పాల్పడితే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుందన్నారు. అటువంటి విధానాన్ని మార్చుకోవాలన్నారు. త్వరలో విద్యార్థుల కోసం మీ నేస్తం అనే కార్యక్రమాన్ని ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్వహి స్తామన్నారు. దాని ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చునన్నారు. ఉప ప్రధానాచార్యులు నాగరాజుతో వివిధ విభాగాల అధిపతులు, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

రామభద్రపురం: రామభద్రపురంలో ట్రాఫిక్ నియంత్రణకు ఆటోవాలాలు సహకరించాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు కోరారు. స్థానిక మూడు రోడ్ల జంక్షన్ వద్ద బుధవారం వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఆర్టీసీ కాంప్లెక్స్, అంతర్జాతీయ కూరగాయల మార్కెట్ ఒకే దగ్గర ఉండడం వలన ట్రాఫిక్ నియంత్రణకు ఇబ్బంది ఉందని, ఆటోలు నిర్దేశిత పార్కింగ్ ప్రదేశంలోనే ఉంచి సహకరించాలన్నారు.కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, వివిధ గ్రామాల ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో బుధవారం ఆచార్య ప్రబోదానంద దివ్య ఆశీస్సులతో ప్రబోదసేవా సమితి, హిందూజ్ఞాన వేదిక బొబ్బిలి శాఖ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ముగింపోత్సవాలు జరిగాయి. ఈ మేరకు బొబ్బిలిశాఖ అధ్యక్షుడు అప్పలనాయుడు ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడిప్రతిమకు పూజలు వేదిక వద్ద నిర్వహించారు. అనంతరం వందలాది మంది స్వామివారి పల్లకి ఉరేగించారు. బొబ్బిలిశాఖ ప్రతినిధులు వెంకటరావు, శంకరరావు, విజయనగరం అధ్యక్షులు శంకరరావు, సీవీఎస్ నాయుడు, అదినారాయణ, వంశీ, రాజేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకే 'తల్లికి వందనం' వర్తింపజేయాలి

బొబ్బిలి: ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులకే తల్లికి వందనం వర్తింపజేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. బుధవారం స్థానిక కోటలో వారంతా ఎమ్మెల్యే బేబీనాయనను కలిసి సమస్యలు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, 117, 128 జీవోలను రద్దు చేయాలని, సబ్జక్టు టీచర్ల కొరత తీర్చాలని, తెలుగు, ఇంగ్లీషుమీడియం రెండింటినీ కొనసాగించాలని తదితర సమస్యల తో వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యలను విద్యామంత్రి, సీఎం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఏపీటీఎఫ్ నాయకులు బంకురు జోగినాయుడు, జేసీ రాజు, ఎల్లయ్య, లక్ష్మణరావు, రమేష్, శ్రీధర్, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

రాజాం: ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కంచరం గ్రామంలో సీసీ రోడ్లు, కాలువల పనులను పరిశీలించారు. కొంతమంది సర్పంచ్‌లు కంటి తుడుపు చర్యగా పనులు చేపడుతున్నారని, అటువంటి పరిస్థితి ఏర్పడ కుండా సర్పంచ్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. సిమెంట్ రోడ్లు,, కాలువలు ఎక్కువ కాలంపాటు ఉండేలా చూడాలన్నారు. నాయకులు గెడ్డాపు అప్పలనాయుడు ఉన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని వినతి

బొబ్బిలి: వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు శంకరరావు ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు లక్ష్మణరావు, అప్పారావు, రాజారావు ముని తదితరులు ఎమ్మెల్యేని కలిసి సమస్యలు వివరించారు. దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

ప్రాణాంతక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాజాం రూరల్: వర్షాకాలంలో వచ్చే మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని, వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎస్.భాస్కరరావు ఆదేశించారు. పట్టణంలోని ఆదర్శనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన మందులు పంపిణీ చేసేలా పర్యవేక్షించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని డీఎంహెచ్‌వో గుర్తు చేశారు. అంతకుముందు పీహెచ్‌సీ రికార్డులతో పాటు మందుల నిల్వలను పరిశీలించారు. వైద్యాధికారి కిరణ్, చంద్రశేఖర్ రాజు, సత్యరాజు పాల్గొన్నారు.

సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షల పరిశీలన

తెర్లాం: మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం జరిగిన సెల్ఫ్ అసెస్మెంట్-1 పరీక్షలను ఎంఈవో త్రినాథరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గౌతం ప్రైమరీ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల్లో జరిగిన పరీక్షలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు రోజుకొకటి చొప్పున వచ్చేనెల నాలుగోతేదీ వరకూ జరుగుతాయని పేర్కొన్నారు. ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా పరీక్షలు నిర్వహించాలని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పరీక్షల అనంతరం మూల్యాంకనం పూర్తిచేసి ఫలితాలను ఆన్‌లైన్ చేయాలని సూచించారు.